

కంప్యూటర్లు లేక.. పనులు ముందుకు సాగక..!

◆ కార్పొరేషన్‌లో డిఈఈలకు కంప్యూటర్ల కొరత
◆ అభివృద్ధి పనులపై ప్రభావం
◆ కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులోనూ జాప్యం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు గదుల కొరత సమస్య రోజులు గడుస్తున్నా పరిష్కారం కావడం లేదు. కూర్చొనేందుకు కుర్చీలు కూడా అధికారులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు కంప్యూటర్, ఇతర సాంకేతిక సమస్యలు కూడా వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రింటర్లు, స్కానర్లు, కంప్యూటర్లు చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఉన్నతాధికారిపై ఉంది. ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యమనే చెప్పాలి. అభివద్ధి పనులపై ప్రతి వారం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం జరపటం.. పనులను వేగవంతం చేయాలని ఆదేశించడం పరిపాటిగా మారింది. అయితే వారి సమస్యలు ఏమిటన్నది మాత్రం ఉన్నతాధికారి పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతివారం అభివద్ధి పనుల పురోగతి నివేదికను ఆన్‌లైన్లో అప్లోడ్ చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పర్యవేక్షణలో డివిజన్లో అభివద్ధి పనులను పరిశీలించి వాటి ప్రగతిని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంది. ఒక వేళ ప్రభుత్వానికి ప్రగతి నివేదికలు వారంవారం పంపకుంటే సంబంధిత సిబ్బంది పనితీరు ప్రాతిపదికన ఇచ్చే పాయింట్లు తగ్గిపోతుంటాయి. భవిష్యత్తులో వారి పనితీరు ప్రామాణికతను ఈ పాయింట్ల ద్వారానే అంచనా వేయనున్నారు. ఇలాంటి పరిస్థితులు సరైన కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలు లేక ఇంజినీరింగ్ సిబ్బంది ఇబ్బందులకు గురువుతున్నారు. కార్పొరేషన్‌లో ఉన్నతాధికారి ఇన్‌ఛార్జిగా ఉన్న సమయంలో ఒక లెనోవా ల్యాప్‌ట్యాప్, ఖరీదైన సెల్‌ఫోన్‌ను ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ ద్వారా నజరానాగా తీసుకున్నట్లు సమాచారం. ఆయన ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత సదరు ల్యాప్‌ట్యాప్ కార్యాలయంలో లేకుండా పోయింది. అభివృద్ధి పనులను పర్యవేక్షించే ఇంజినీరింగ్ అధికారులకు కంప్యూటర్లు, కుర్చీలు, గదులు ఏర్పాటు చేయకుండా ఉన్నతాధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విషయం అంతుపట్టకుండా ఉంది. కార్పొరేషన్‌లో మరో విశేషం ఏమిటంటే సాంకేతిక పరిజ్ఞానం లేకున్నా, పాలనాపరమైన విధులు నిర్వహించే వారికి మాత్రం అత్యాధునిక సాంకేతిక ల్యాప్‌ట్యాప్‌లను సమకూర్చారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది, అధికారులు సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నా పర్వాలేదు కానీ కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారికి మాత్రం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సామాగ్రిని ఆగమేఘాలమీద సమకూర్చటంలో ఔచిత్యం ఏమిటన్నది మాత్రం అర్థంకాని ప్రశ్నగా మారింది. కంప్యూటర్, సాంకేతిక సమస్యల కారణంగా అభివద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సంబంధిత ఉద్యోగుల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ సమస్య కాంట్రాక్టర్లపైనా కూడా పడుతోంది. ఆన్‌లైన్‌లో చేసిన పనులు అప్లోడ్ చేయని కారణంగా బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీని వల్ల కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. బిల్లుల చెల్లింపు జరగాలంటే ఆరు దశలను దాటుకుని సిఎఫ్ఎంఎస్‌కు చేరాల్సి ఉంటుంది. సాంకేతిక సమస్యలతో ఈ బిల్లులన్నీ ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి. చాలా మంది కాంట్రాక్టర్లు బిల్లుల కోసం కార్యాలయం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా వారి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనంతపురం కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలో నెలకొన్న కంప్యూటర్లు, ఇతర సాంకేతిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



కాయ్‌రాజాకాయ్..!

◆ ఉమ్మడి జిల్లాలో జోరుగా క్రికెట్ బెట్టింగ్
◆ పెద్ద ఎత్తున నష్టపోతున్న యువత
◆ ఆన్‌లైన్‌లోనూ మాయా జూదం
◆ పోలీసు నిఘా ఉన్నా నియంత్రించలేని స్థితి
◆ ఫైనల్ మ్యాచ్‌లో భారీగా నగదు చేతులు మారే అవకాశం..?

ప్రస్తుతం ఎక్కడ చూసినా క్రికెట్ ఫీవర్ కన్పిస్తోంది. క్రికెట్‌లో అత్యుత్తమంగా చెప్పకునే వరల్డ్ కప్ పోటీలు ముగింపు దశకు వచ్చేశాయి. అందులోనూ ఇండియా ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం నాడు ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ క్రికెట్ గురించే మాట్లాడుకుంటున్నారు. ఇక్కడి వరకూ బాగానే ఉన్నా, ఇందులో బెట్టింగ్ మహమ్మారి ప్రవేశించి యువతను పెడదోవ పట్టించేస్తోంది. అక్కడ వాళ్లు ఆట ఆడుతుంటే ఇక్కడ కాయ్‌రాజాకాయ్ అంటూ ఆ ఆటపై పందేలు కాస్తున్నారు. వందలు, వేలు కాదు.. ఏకంగా లక్షలాది రూపాయలు బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యువత క్రికెట్ బెట్టింగ్ మాయలో పడి అప్పలఊబిలో కూరుకుపోతున్నారు. ఆన్‌లైన్‌లోనూ జూదాలు అందుబాటులో ఉండడంతో చాలా మంది దీనికి బానిసలై సరస్వాన్ని కోల్పోతున్నారు. పోలీసులు దీనిపై నిఘా ఉంచినా పూర్తి స్థాయిలో ఈ జూదాన్ని నియంత్రించలేని పరిస్థితి ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలా మంది క్రీడాకారులు ఉన్నారు. ముఖ్యంగా క్రికెట్ ప్రేమికులు ఎక్కువ. క్రికెట్ మ్యాచ్ వస్తే టీవీలకు అతుక్కుపోయి ఆ ఆటను చూస్తూ ఆస్వాదిస్తారు. కుటుంబం అంతా కలిసి చూసే ఆట క్రికెట్. మారిన పరిస్థితుల దృష్ట్యా క్రికెట్ ఆటగా మర్చిపోయి జూదంగా మారింది. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచకప్‌లో జోరుగా బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు బుకీల అవతారం ఎత్తి దీనిని నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని వారి నుంచి డబ్బులు గుంజేస్తున్నారు. ఒక్కసారి దీనికి అలవాటు పడిన వారు అందులో కూరుకుపోయి అప్పులపాలు అవుతున్నారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు, వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఈ బెట్టింగ్‌లు ఆడుతున్నట్లు తెలుస్తోంది.

బంతిబంతికీ బెట్టింగ్..

బెట్టింగ్‌లో అనేక రకాల పద్ధతులను అవలంభిస్తున్నారు. గతంలో మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారన్న దానిపై మాత్రమే బెట్టింగ్ జరిగేది. ఐపిఎల్ వచ్చాక బెట్టింగ్‌లోనూ కొత్త పద్ధతులు వచ్చాయి. బంతిబంతికీ బెట్టింగ్ కాసే అవకాశాలను కల్పించారు. మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారు.? ఎన్ని పరుగులు సాధిస్తారు..? స్కోర్ సరి సంఖ్య వద్ద నిలుస్తుందా..? బేసి సంఖ్య వద్ద నిలుస్తుందా..? ఎక్కువ పరుగులు ఎవరు చేస్తారు..? వికెట్లు ఎవరు ఎక్కువ తీస్తారు.? ఇలా ఒక్కటేమిటి బంతిబంతికీ బెట్టింగ్ కాస్తున్నారు. పదులు, వందలు కాదు... వేలు, లక్షల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లోనూ బెట్టింగ్‌లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. సెల్‌ఫోన్ల ద్వారానే ఈ బెట్టింగ్‌లు ఆడేస్తున్నారు. ఇలా బెట్టింగ్‌కు బానిసైన వారు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు.

పోలీసుల కళ్లు గప్పి...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు పెద్ద ఎత్తున దృష్టి సారించారు. క్రికెట్ మ్యాచ్‌లు జరిగే ప్రతిసారీ పోలీసులు బెట్టింగ్‌లు ఆడేవారికి హెచ్చరికలు జారీ చేస్తారు. ఈ సారి వరల్డ్ కప్ ప్రారంభం సమయంలో కూడా ఎస్పీ స్థాయి అధికారులు బెట్టింగ్‌పై గట్టి హెచ్చరికలు చేశారు. బెట్టింగ్ ఆడితే అరెస్టు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరించారు. అయినా వీరి హెచ్చరికలను బేఖాతర్ చేసి బెట్టింగ్‌లు ఆడతున్నారు. సాంకేతికతను ఉపయోగించి, పోలీసులకు అనుమానం రాకుండా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గతంలో చాలాసార్లు బెట్టింగ్ జూదరులను పోలీసులు అరెస్టు చేసి, కటకటాల వెనక్కి పంపారు. గతేడాది అయితే అంతర్‌రాష్ట్ర క్రికెట్ బుకీని అనంతలో అరెస్టు చేశారు. ఇలా ఓ వైపు పోలీసుల అరెస్టులు జరుగుతున్నా బెట్టింగ్ మాత్రం అదుపులోకి రావడం లేదు. వైరస్‌లా విస్తరిస్తున్న ఈ క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు పూర్తి స్థాయి నిఘా ఉంచి నియంత్రించకపోతే భవిష్యత్తులో దీని బారిన పడి అనేక మంది వారి జీవితాలను నాశనం చేసుకునే ప్రమాదం ఉందని నిపుణులు తెలియజేస్తున్నారు.

వడ్డీ వ్యాపారుల జోరు

క్రికెట్ బెట్టింగ్‌లో మరో కోణం వడ్డీ వ్యాపారం. క్రికెట్ జూదం ఆడేవారు ఇతరుల వద్ద అప్పులు చేస్తుంటారు. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని వడ్డీ వ్యాపారులు వేలాది రూపాయలను అధిక వడ్డీలకు ఇస్తున్నారు. రోజు వడ్డీ పేరుతో డబ్బులు ఇస్తున్నారు. ఆరోజు మ్యాచ్‌లో గెలిస్తే డబ్బులను ఇచ్చేస్తున్నారు. ఒక వేళ మ్యాచ్ ఓడిపోతే తీసుకున్న డబ్బులకు పత్రాలు రాయించుకుంటున్నారు. ఇలా చాలా మంది వడ్డీ వ్యాపారుల ఉచ్చులో ఇరుక్కుపోతున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు జూదం, మరో వైపు అధిక వడ్డీలతో జూదరులు సర్వసం కోల్పోతున్నారు. జూదం నిర్వహించే వారు కూడా బుకీ అవతారం ఎత్తి డబ్బులను తీసుకుంటున్నారు. బెట్టింగ్ ఆడేవారి నుంచి మ్యాచ్ కలిస్తే ఈ బుకీలు 30 నుంచి 40 శాతం మొత్తాన్ని కమిషన్ రూపంలో తీసుకుంటున్నారు. ప్రపంచ కప్‌లో ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్‌లు ఒక ఎత్తు అయితే ఆదివారం నాడు జరిగే ఫైనల్ మ్యాచ్‌కు పెద్ద మొత్తంలో మెట్టింగ్ రూపంలో చేతులు మారే అవకాశం కన్పిస్తోంది. పట్టణ కేంద్రాల్లో మకాం వేసి ఫైనల్ మ్యాచ్‌లో పెద్ద మొత్తంలో బెట్టింగ్ నిర్వహించి డబ్బులు కొల్లగొట్టాలని బుకీలు పతకం రచించినట్లు సమాచారం. ఇలాంటి వాటిపై పోలీసులు నిఘా ఉంచి బుకీలను అదుపులోకి తీసుకుని క్రికెట్ బెట్టింగ్‌ను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయండి

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రాజెక్టులకు భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 544డి, బిటిపి ప్రాజెక్టు, రైల్వే ప్రాజెక్టులు, బంజారా, ఎరుకల భవన్, రెసిడెన్షియల్ స్కూల్స్, డిజేబుల్ హోమ్, కార్పొరేషన్ కమ్యూనిటీ హాళ్లు, పర్యాటక శాఖ తదితర ప్రాజెక్టులకు భూసేకరణను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు గ్రంధి వెంకటేష్, రాణి సుష్మిత, సి.శ్రీనివాసులురెడ్డి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, డిటిడబ్ల్యుఒ అన్నాదొర, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బుకొఠారి, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ పాల్గొన్నారు.

కౌలు రైతు ఆదిశేషయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు ఆదిశేషయ్య కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదిన తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి గ్రామ కౌలు రైతు ఆదిశేషయ్య(56) లక్షలాది రుపాయలు పంటల సాగు కోసం అప్పులు చేశాడన్నారు. పంట కాపాడుకోవడం కోసం నాలుగు బోర్లు వేశాడని, పెట్టుబడి పెట్టి పంటలు రాక చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక క్రిమిసంహారక మందు తాగి మృతి చెందాడన్నారు. కౌలు రైతు తనకున్న సొంత పొలం రెండు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు వేయడం వల్ల కౌలు, పంటల పెట్టుబడి, నాలుగు బోర్లు వేయడం వల్ల అప్పులు చేశాడన్నారు. ప్రభుత్వం కౌలు రైతులకు ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వ సహాయం, బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరూ వేసిన పంటలను ఈక్రాప్ బుకింగ్ చేయాలన్నారు. ఏ ఒక్క కౌలు రైతును కూడా ఈ క్రాప్ బుకింగ్ చేసిన పాపాన ప్రభుత్వం పోలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పంట నష్టపరిహారం, పంటల బీమా కౌలు రైతులకు ఏ విధంగా ప్రభుత్వం అందించగలుగుతుందన్నారు.ప్రత్యేక సర్వే ద్వారా కౌలు రైతులు వేసిన పంటలను ఈక్రా బుకింగ్ చేసి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆదిశేషయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. బ్యాంకుల ద్వారా బయట ప్రైవేటు వ్యక్తుల ద్వారా చేసిన అప్పులన్నీ మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దేవాదాయ శాఖ ఏసిపై చర్యలు తీసుకోవాలి

దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు సిపిఎం నేతలు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేదలు వేసుకున్న గుడిసెలను రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి తొలగింప జేసి పేదలను రోడ్ల పాలు చేసిన అనంతపురం జిల్లా దేవాదాయ శాక సహాయ కమిషనర్ ఆదిశేషునాయుడుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, జిల్లా నాయకులు తరిమెల నాగరాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విజవాడలోని దేవాదయ శాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గార్లదిన్నె మండలం, కల్లూరు గ్రామంలో దేవాదాయ భూముల్లో పేదలు గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.ఆ భూమిని కబ్జా చేయాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుట్రలు చేస్తున్నారని, ఇది వరకే 1.30 ఎకరాల భూమిని ప్లాట్లు వేసి విక్రయించారని తెలిపారు. పేదలు వేసుకున్న స్థలంలోనే కొందరు అధికార బలం ఉన్న వారు 8 సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని తెలిపారు. వారందరికి దేవాదాయ చట్టం అమలు చేయకుండా పేదల గుడిసెలపై ఒక్కటే సహాయ కమిషనర్ ఆదిశేషునాయుడు అమలు చేసి పేదలను రోడ్లు పాలు చేశారని వివరించారు. గ్రామంలో 57 ఎకరాల 36 సెంట్ల దేవాదాయ భూమి కొందరు ఆక్రమించుకుని ప్లాట్ల వ్యాపారం చేస్తున్న స్పందించని సహాయ కమిషనర్ పేదలు వేసుకున్న 150 గుడిసెలకు నోటీసులు ఇవ్వకుండా, హై కోర్టు ఆదేశాల్ని ఖాతర్ చేయకుండా కూల్చి వేయడం వెనక కోట్ల రూపాయల లావాదేవీలు ఉన్నాయని ఆరోపించారు. 165 సర్వే నెంబర్లు మూడు ఎకరాల 43 సెంట్లు స్థలం ఉండగా అందులో ఎకరా 43 సెంట్లు ఒక ప్రైవేటు వ్యక్తి ప్లాట్లు వేసి ఇళ్ల నిర్మాణం చేస్తున్నప్పటికీ వాటిని ఆపకుండా కేవలం రెండు ఎకరాల్లోని పేదలను మాత్రమే ఖాళీ చేయించడం పై విచారణ జరిపించాలని కోరారు. ఏసి అవినీతిని ప్రశ్నిస్తామనే భయంతో పది రోజులుగా ఆఫీసుకు రాకుండా తప్పించుకుంటున్నారని తెలిపారు. అధికార పార్టీకి సంబంధించిన కొద్దిమంది నేతలతో ఈయనకు ఉన్న వ్యక్తిగత లావాదేవీలే ఈ కూల్చివేతకు ప్రధాన కారణాలని తెలిపారు. మొత్తం దేవుని మన్యం భూములు ఏ రకంగా ఆక్రమణ గురవుతున్నాయో సర్వే నెంబర్ల వారిగా రాష్ట్ర కమిషనర్ వివరించారు. కమిషనర్ స్పందించి అసిస్టెంట్ కమిషనర్‌కు ఫోన్ చేసి పేదల గుడిసెలు మాత్రమే తొలగించి పెద్దలను ఎందుకు మినహాయించారని, వారికి నోటీసులు ఇచ్చినప్పుడు పేదలకు కూడా నోటీసులు ఇవ్వాలి కదా అని నిలదీశారు. నివాసాలు కోల్పోయి వీధుల్లో పడిన పేదలకు జిల్లా అధికారులతో మాట్లాడి తగు న్యాయం చేస్తానని కమీషనర్ సత్యనారాయణ హామీ ఇచ్చినట్లు సిపిఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గార్లదిన్నె మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాయకులు శంకర్, రవి, కల్లూరు నిరాశ్రయులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన ప్రభుత్వం

ఏపీ సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



విలేకరులతో మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత రాష్ట్రంలోని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని ఏపీ సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తికి వెళుతూ అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గహానికి విచ్చేశారు. ఆయన్ను ఐ అండ్ పిఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయల సమావేశంలో కొమ్మినేని మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పాలన జరుగుతోందని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ వారి ఇళ్ల వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు జీవోలో అసంబద్ధ నిబంధనలు సవరించాలని, అర్హులకు న్యాయం చేయాలని పలువురు జర్నలిస్టులు కొమ్మినేనిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు.

నేడు జెఎన్‌టియు సాంస్కృతిక ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం


అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్-2023 ఉత్సవాలను ప్రారంభించనున్నట్లు ఉపకులపతి రంగజనార్ధన తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో ఇందుకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్-2023 ఉత్సవాల్లో భాగంగా 17, 18వ తేదీల్లో విద్యార్థులకు డ్యాన్సులు, పాటలు, ఆటలు, మిమిక్రీ, ప్యాషన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, జి.మమత, ఎం.అంకారావు, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ప్రజలకు మెరుగైన సేవలు

ఉరవకొండ ఎంపిపి వెలుగొండ నరసింహులు-అట్టహాసంగా ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-ఉరవకొండ

సిఎం జగన్ ఆదేశాలను అనుసరించి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి లక్ష్యాలకు అనుగుణంగా మండల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని నూతనంగా ఎంపిపిగా బాధ్యతలు స్వీకరించిన వెలగొండ నరసింహులు అన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ అధికారి కుష్బూ కొఠారి, ఎంపిడిఒ అమృతరాజ్, ఆధ్వర్యంలో గురువారం ఉరవకొండ మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగొండ నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి, ఎడిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, వైసిపి జిల్లా అధ్యక్షులు పైల నరసింహయ్య హాజరయ్యారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఎంపిపి ఎన్నికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, యువజన విభాగం రాయలసీమ జిల్లా అధ్యక్షులు ప్రణయ్‌రెడ్డితోపాటు మండల సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నరసింహులుకు పలువురు పుష్పగుచ్ఛాలు అందించి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పార్వతమ్మ, రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మీసాల రంగన్న, ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ పామిడి వీరాంజనేయులు, బెస్త, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు రమణ, గోవిందు, జోగి వెంకటేసులు, మార్కెట్ యార్డు ఛైర్మన్ బోయ సుశీలమ్మ, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, పట్టణ,రూరల్ అధ్యక్షులు ఎర్రిస్వామి, సుంకన్న, సమన్వయకర్త ఓబన్న, తదితరులు పాల్గొన్నారు.



ఎంపిపి వెలుగొండ నరసింహులును సన్మానిస్తున్న నాయకులు

వైసిపి కబ్జాలకు అంతేలేదు : కాలవ



కలెక్టర్‌కు రాసిన లేఖను చూపుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

విలువైన ప్రభుత్వ స్థలాలను వైసిపి నాయకులు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. మండల పరిధిలోని 74-ఉడేగోళం గ్రామంలో వైసిపి నాయ కుడు బోర్‌వెల్ నాగిరెడ్డి కబ్జా చేసిన స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం కాలవ విలేకరు లతో మాట్లాడుతూ ఉడేగోళం పంచాయతీ పరిధిలోని సర్వే నెం:77లో 5.3 ఎకరాల భూమిలో కొంత స్థలాన్ని గతంలో పాత్రికేయులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించారన్నారు. మిగిలిన స్థలాన్ని గ్రామ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. ఆయన ప్రధాన అనుచరుడు నాగిరెడ్డి కబ్జా చేసిన స్థలంపై ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి నోరు విప్పాలని డిమాండ్ చేశారు. కాలవతో పాటు నాయకులు టంకసాల హనుమంతు, శివానంద, విజయ్‌కుమార్, ఓబయ్య, శ్రీకంఠప్ప, మహానంది, మంజునాథస్వామి, నల్లయ్య, తిప్పేస్వామి, చిన్నసూరయ్య, తమ్మయ్య ఉన్నారు.

అక్రమ లే-అవుట్లపై 'కాపు' అడ్డగోలు ఆరోపణలు

నాలుగేళ్లలో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సహజ వనరులను కొల్లగొట్టి తప్పుడు మార్గాల్లో కోట్ల రూపాయలు ఆర్జించి, తనపై అభాండాలు వేస్తున్నారని కాలవ పట్టణంలోని తన నివాసంలో ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు. ప్రశాంతమైన రాయదుర్గంలో విచ్చలవిడిగా దందాలు, అక్రమాలు చేస్తున్న కాపు చరిత్ర హీనుడిగా మిగిలిపోతాడన్నారు. 'కాపు' సవాల్‌ను స్వీకరించి అక్రమ లే-అవుట్లపై సమగ్ర విచారణ చేయించాలని కలెక్టర్‌కు గురువారం మెయిల్ ద్వారా లేఖ పంపానన్నారు. అక్రమ లేఅవుట్లపై ఎమ్మెల్యే కూడా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కాలవ సవాల్ చేశారు.

కెజిబివి ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేయాలి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

కేజీబీవీ పాఠశాలల్లో నూతనంగా ఎంపికైన ఉద్యోగులు సమర్థవంతంగా పని చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి నాగరాజు సూచించారు. గురువారం బుక్కరాయసముద్రం మండలం వడియంపేట సమీపంలోని వైవి.శివారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఎంపికైన సిఆర్‌టిలు, పిజిటిలకు ఆరు రోజుల ఇండక్షన్ శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణను పూర్తి చేసుకున్న తర్వాత విధుల్లోకి వెళ్లి సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గీత, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వరప్రసాదరావు, జిసిడిఓ మహేశ్వరి, అబ్జర్వర్లు వెంకటరెడ్డి, ఇస్మాయిల్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి మృతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



రామ్‌చరణ్ (పాతచిత్రం

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి మృతిచెందిన ఘటన గురువారం మండల కేంద్రంలోని పోతులప్ప ఆలయ సమీపంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన యదభూషణ్ కుమారుడు రామ్‌చరణ్ (15) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇందులో భాగంగానే ఉదయం పాఠశాలకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. ఇదే సమయంలో ఎదురుగా వచ్చిన ట్రాకర్ విద్యార్థి మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బాలుడి తల్లిదండ్రులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. అనంతరం పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మూర్ఛవ్యాధిపై అపోహలు వీడాలి

నేడు జాతీయ ఎపిలెప్సీ దినోత్సవం - సవీరా ఆసుపత్రి వైద్యులు జాషువ కాలేబ్



ప్రజాశక్తి-అనంతపురం

మూర్ఛవ్యాధిపై అపోహలు వీడి క్రమం తప్పకుండా చికిత్స చేయించుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదని కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు జాషువా కాలేబ్ సూచించారు. గురువారం జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ మూర్ఛవ్యాధితో బాధపడుతున్న వారిలో అవగాహన పెంచడానికి దేశవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూర్ఛవ్యాధి మెదడులో ఉన్న నరాలు కరెంట్ ప్రసరణలో భిన్నమైన మార్పులు ఏర్పడటం వల్లే వ్యాధి వస్తుందన్నారు. అంతేగాకుండా చిన్న వయసులో బిడ్డ ప్రసవించే సమయంలో మెదడుకు ఆక్సిజన్ అందకపోవడం, శరీరంలో చక్కెర స్థాయి తగ్గడం, మెదడులో ఆకారపరమైన మార్పులు రావడం, కణుతులు ఏర్పడడం, పక్షవాతం వచ్చినప్పుడు మెదడులో మచ్చ ఏర్పడడం, రక్తంలో అమ్మోనియా లాంటి పదార్థాలు మోతాదు పెరగడం, జన్యుపరమైన సమస్యల కారణంగా మూర్ఛవ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. మూర్ఛవ్యాధిగ్రస్తులు అనేక రకాలైన వివాహ, కుటుంబ సంబంధ సమస్యలతో బాధపడుతుంటారన్నారు. ఈ వ్యాధి గ్రస్తులను వివాహం చేసుకోవడానికి కూడా వెనుకడుగు వేస్తారన్నారు. అలాంటి అపోహలు వీడి మూర్ఛ వ్యాధి ఉన్నవారిని మనలో ఒకరిగా చూడాలన్నారు. ముఖ్యంగా రోగులుగా చూడకూడదన్నారు. అయితే మూర్ఛ వచ్చిన సమయంలో తోటివారు ఆ వ్యక్తితోనే ఉండాలన్నారు. పదునైన, హానికరమైన వస్తువులకు దూరంగా ఉంచాలన్నారు. నోటిలో ఏ వస్తువులూ పెట్టకూడదన్నారు.

కోఆప్షన్ సభ్యుడిగా హబీబుల్లా ఏకగ్రీవం

ప్రజాశక్తి-డి.హీరేహాల్

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కో ఆప్షన్ సభ్యుడి ఎన్నికల్లో హబీబుల్లా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. వైసిపికి చెందిన కోఆప్షన్ సభ్యుడు ఇషాక్ అనారోగ్యంతో మృతి చెందగా ఆ స్థానానికి ఎన్నిక నిర్వహించగా వైసిపి తరపున హబీబుల్లా ఒక్కడే నామి నేషన్ దాఖలు చేయడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. అనంతరం హబీబు ల్లాకు ధ్రువీకరణ పత్రం అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. హబీబుల్లా మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మండల వైసిపి ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ గౌరవాన్ని నిలబెట్టుకోవడం కోసం, పార్టీ, మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ భాస్కర్‌బాబు, తహశీల్దార్ ఈశ్వర్‌రెడ్డి, ఎంపిపి పవిత్రవన్నూరు స్వామి, జడ్పిటిసి హసీనాబాను, ఎంపిటిసి సభ్యులు శివలింగ, కళ్యాం అనిత, రుద్రమ్మ, మహేష్, గోవిందు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, మండల కన్వీనర్ వన్నూరుస్వామి, నాయకులు రహంతుల్లా, సింగాడి జగదీష్, తొండ వెంకటేష్, కాశీంపీరా, తదితరులు పాల్గొన్నారు.



హబీబుల్లాకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి సుబ్రమణ్యం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : మాజీమంత్రి సునీత

ప్రజాశక్తి-ఆత్మకూరు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీమంత్రి పరిటాల సునీత అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు టిడిపికి మద్దతు ఇచ్చి చంద్రబాబును సిఎంను చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల ఇన్‌ఛార్జి ధర్మవరపు బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, బీసీ సెల్ అధికార ప్రతినిధి వడ్డే నాగేంద్ర, వాల్మీకి సాధికార సర్వే నియోజవర్గం అధ్యక్షుడు కందలు ఓబళపత్తి, ఉపాధ్యక్షులు లక్ష్మీదేవమ్మ, మండల సాంస్కృతి సంఘం అధ్యక్షుడు కె.బాలప్ప, సీనియర్ నాయకులు పోతన్న, కుర్లపల్లి వార్డు సభ్యుడు రవి, నాయకులు బొమ్మయ్య, పూల ఓబళపతి, కురువ మనోహర్, అరవింద్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీమంత్రి సునీతమ్మ

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. గురువారం కూడేరు మండలంలోని కరుట్లపల్లి, తిమ్మాపురం, చోళసముద్రం గ్రామాల పరిధిలో 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ.82 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే మండలంలోనే కాకుండా చుట్టుపక్కల మండలాల్లో కూడా విద్యుత్ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు. అక్కడి నుంచి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అనంత వెంకటరెడ్డి కాలనీ ముఖద్వారాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ సోమర జయచంద్రనాయుడు, వైసిపి సీనియర్ నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, తిప్పారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రమణయాదవ్, మాజీ ఎంపిపి తిప్పయ్య, తిరుపతయ్య, సూర్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం

బెలుగుప్ప : 2024 ఎన్నికల్లో జనసేన, టిడిపి పొత్తుతో వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడుదాంని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. గురువారం నియోజకవర్గంలోని కౌకుంట్ల గ్రామంలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్, టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆదేశాల మేరకు ఆత్మీయత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి వైసీపీ ప్రభుత్వానికి గద్దె దించేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లికార్జున, జనసేన మండల అధ్యక్షుడు కాసంశెట్టి సుధీర్, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడికట్ల సంబరాల గోడపత్రిక విడుదల

బొమ్మనహాల్ : ఈ నెల 19వ తేదీ అనంతపురం నగరంలో నిర్వహిస్తున్న గుడికట్ల సంబరాలను విజయవంతం చేయాలని బొమ్మనహాల్ కురుబ సంఘం అధ్యక్షులు పరమేశ్వరం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని ఉంతకల్లు గ్రామంలో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో గుడికట్ల సంబరా ల గోడపత్రికలను రాష్ట్ర కురుబ సంఘం అధ్యక్షులు బోరంపల్లి రామాంజనేయులు విడుదల చేశారు. కార్యక్ర మంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, బసవరాజు, ఎస్కే మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీలకు అధిక ప్రాధాన్యత : మేయర్

అనంతపురం కార్పొరేషన్ : నగరంలో రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. గురువారం నగరంలోని 20వ డివిజన్ పరిధిలో జీజీఎంపీ నిధులు రూ.20లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్ విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత పాలకులు పేదలు అధికంగా నివసించే అంబేద్కర్ నగర్‌ను అభివృద్ధి చేయకుండా పూర్తిగా విస్మరించారన్నారు. అయితే తాము అధికారంలోకి వచ్చాక రూ.కోట్లు వెచ్చించి రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాకే చంద్రకళ, కమల్‌భూషణ్, సైపుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం, నాయకులు

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-ఉరవకొండ

వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో అవినీతి రహితంగా సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాభివృద్ధికి కృషి చేసిన సిఎం జగన్‌ను తిరిగి మళ్లీ గెలిపించుకోవాలని వైసిపి అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి, రజక కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ మీసాల రంగన్న పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సచివాలయం-3లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సమీపంలో వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం-3 పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో డ్వాక్రా, రైతు రుణమాఫీ చేస్తామని చేయలేదన్నారు. అలాగే నిరుద్యోగ భృతితోపాటు 600కిపైగా హామీలను అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేశారన్నారు. అయితే సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే నవరత్నాల హామీలను అమలు చేశారన్నారు. అంతేగాకుండా ఎన్నికల హామీలన్నీ అమలు చేసినట్లు తెలిపారు. కావున తిరిగి జగన్‌ను సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందనిఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ముచ్చుకోట గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్ జగన్ ఎందుకు కావాలనే' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిరెడ్డి, జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, వైస్ ఎంపిపి కళావతి, వైసీపీ మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, చర్లపల్లి రామిరెడ్డి, తురకపల్లి శివారెడ్డి, వరదాయపల్లి శివారెడ్డి, ఎంపిటిసి అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, హేమసుందర్‌రెడ్డి, ఓబిరెడ్డి, సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుందుర్పి : గత ప్రభుత్వంలో మాదిరిగా దళారులకు అవకాశం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచి గోవిందమ్మ ఓబన్న పేర్కొన్నారు. మండల పరిధిలోని మలయ నూరు సచివాలయం-1లో గురువారం ఎంపిడిఒ లక్ష్మీనరసింహ అధ్యక్షతన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి కెంచమ్మ, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, వైసిపి సీనియర్ నాయకులు సుదర్శనరెడ్డి, రామ్మూర్తి, మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, రాజగోపాల్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'వై ఎపి నీడ్స్ జగన్'లో నాయకులు



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

వ్యాసరచన పోటీల్లో కె.శిరీష ప్రతిభ



ఉరవకొండ : భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 98వ జన్మదిన ఉత్సవాలను పురస్కరించుకుని గతనెలలో రాష్ట్రవ్యాప్తంగా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉరవకొండకు చెందిన డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.శిరీష ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. వచ్చేవారం పుట్టపర్తిలో జరగనున్న శ్రీ సత్యసాయి జన్మదిన ఉత్సవాల సందర్భంగా ఈనెల 21న స్వామి సన్నిధిలో శిరీష గోల్డ్ మెడల్ అందుకోనుంది. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించిన శిరీషను శ్రీ సత్యసాయి సంస్థల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎన్.అంజనయ్య, సాయిసంస్థల జిల్లా అధ్యక్షులు డాక్టర్ రామచంద్రమూర్తి, బాలవికాస్, విద్యా విభాగం జిల్లా కోఆర్డినేటర్ కె.గీతాసుకుమార్, ఆధ్యాత్మిక విభాగం జిల్లా కోఆర్డినేటర్ శైలజ, భజన్స్ విభాగం జిల్లా కోఆర్డినేటర్ సాయిచరణ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.రామకృష్ణ, కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

మండల ఉపాధ్యక్షుల ఎన్నిక వాయిదా

పెద్దపప్పూరు : మండల కేంద్రంలో గురువారం చేపట్టిన ఉపాధ్యక్షుల ఎన్నిక వాయిదా పడినట్లు మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు మండల ఉపాధ్యక్షులను గురువారం ఎన్నుకోవాల్సి ఉంది. అయితే కోరం లేకపోవడంతో ఉపాధ్యక్షుల ఎన్నిక వాయిదా వేసినట్లు తెలిపారు.

కంటి వైద్యశిబిరం

ఉరవకొండ : విడపనకల్లు మండలం ఉండబండ గ్రామంలో జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా ఎల్‌వి.ప్రసాద్ కంటి వైద్య ఆసుపత్రి సహకారంతో 20 మందికి పరీక్షలు నిర్వహించడంతోపాటు మరో 26 మందికి మెరుగైన కంటి చికిత్సల కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. ఈ శిబిరంలో సుమారుగా 100 మందికి వివిధ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్ర, లయన్స్ క్లబ్ సభ్యులు నూర్, గ్రామ పెద్దలు భాస్కర్, సురేంద్ర, గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం

ఉరవకొండ : మండలంలోని షేక్షానుపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ రక్తహీనతతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న ఉరవకొండ అపద్బాంధవ ట్రస్టుకు తెలియజేశారు. దీంతో ట్రస్టు వారు స్పందిస్తూ ఉరవకొండకు చెందిన యున్నుస్ రఫిక్‌కు సమాచారం అందజేయడంతో అనంతపురం రక్తనిధికి చేరుకుని రక్తదానం చేశారు.

గ్రంథాలయ వారోత్సవాలు

గుత్తి : వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి హెచ్.రామాంజనేయులు ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమకారులకు గురువారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా అయ్యంకి వెంకటరమణయ్య, డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ప్రజలకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల ఏర్పాటుకు ఉద్యమించిన ఉద్యమకారులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని విశ్రాంత ప్రధానోపాధ్యాయ శేషమరాలు, నారాయణస్వామి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, డాక్టర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వెంకటేశ్వరు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి జి.నల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారిణి జీవన ఆధ్వర్యంలో గురువారం గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత కండక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి -కుందుర్పి

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌బి సిఐ అల్లాబకాష్ సూచించారు. స్థానిక ఖుషి డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ చిన్న వయసులో విద్యార్థి దశలోనే మత్తు పదార్థాలకు బానిస అయితే మీ జీవితాలను మీరే పాడు చేసుకునే వారవుతారని హెచ్చరించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస అయితే వారి కుటుంబాలు, తల్లిదండ్రులు నిత్యం నరకయాతనతో తల్లడిల్లిపోతారన్నారు. తద్వారా వారూ అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. మద్యం, మత్తు, పొగాకు, ఉత్పత్తులపై వ్యతిరేకత పెంచుకుం టే యువత జీవితం బంగారు బాటగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణకుమారి, ఎస్ఐ పవన్‌కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ, జూనియర్ లెక్చరర్ వసికేరప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ అల్లాబకాష్

కుందుర్పి వైస్ ఎంపిపిగా భీమిరెడ్డి

ప్రజాశక్తి-కుందుర్పి

కుందుర్పి వైస్ ఎంపిపిగా గురువారం ఏళ్లచింత భీమిరెడ్డి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కమలానాగరాజు, ఎంపిడిఒ లక్ష్మీనరసింహ అధ్యక్షతన ప్రమాణ స్వీకారం చేశారు. వైసిపి నాయకులు మాట్లాడుతూ గతంలో వైస్ ఎంపిపిగా ఉన్న బిజి.సోమనాథ్ మృతి చెందడంతో ఆ స్థానంలో ఏళ్లచింత భీమిరెడ్డిని ఎంపిక చేశారన్నారు. నూతన వైస్ ఎంపిపి భీమిరెడ్డి మాట్లాడుతూ పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీనే నమ్ముకున్న నాకు మంత్రి కెవి.ఉషశ్రీచరణ్ ఆశీస్సులతో ఈ పదవి దక్కిందన్నారు. మండల అభివృద్ధికి, వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి రాధాస్వామి, వైస్ ఎంపిపి శ్రీలక్ష్మిఅజయ్‌బాబు, కోఆప్షన్ మెంబర్ ముజీవుల్లా, వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సీనియర్ నాయకుడు సుదర్శన్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ఈ.రాము, సింగిల్‌విండో అధ్యక్షుడు వన్నూరురెడ్డి, వాల్మీకి స్టేట్ డైరెక్టర్ పాలాక్షి, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న వైస్ ఎంపిపి భీమరెడ్డి

విఆర్ఎ మృతిపై పలువురు సంతాపం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని నేమకల్లు విఆర్ఎ బోయ హనుమంతు అనారోగ్యంతో నెల రోజులుగా కర్నూలు నగరంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు భార్య పార్వతి తెలిపారు. విషయం తెలిసిన వెంటనే తహశీల్దార్ శ్రీనివాసులు, సర్పంచి పరమేశ్వర హనుమంతు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. తహశీల్దార్ మాట్లాడుతూ హనుమంతు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలను అందేలా కృషి చేస్తామని తెలిపారు. డీలర్ జగన్, విఆర్ఎల మండల సంఘం అధ్యక్షులు మారుతి రవీంద్ర, సిబ్బంది, గ్రామస్తులు విఆర్ఎ మృతికి సంతాపం తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-నార్పల

ఆటో డ్రైవర్లు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలను అతిక్రమించినా, అతివేగంగా వాహనాలు నడిపినా, లైసెన్స్ లేకుండా ఆటోలు, ట్రాక్టర్లు నడిపినా, ఓవర్ లోడ్‌తో వెళ్లినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ దివాకర్, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఆటో డ్రైవర్లు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జనార్ధన్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని వై.కొత్తపల్లి హైవేపై ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

18న షిర్డీసాయిబాబా విగ్రహప్రతిష్టాపన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరం బళ్లారి రోడ్డు ఓంనగర్‌లో నూతనంగా వెలిసన షిర్డీసాయిబాబా మందిరంలో ఈ నెల 18న బాబా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 18వ తేదీ శనివారం నాడు ఉదయం 8-30 గంటలకు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12-30 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు

కళ్యాణదుర్గం : కార్తీక మాసం సందర్భంగా కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిఎం బద్రీనాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం సాయంత్రం 5 గంటలకు డిపో నుంచి బస్సు బయల్దేరుతుందని, రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉన్నట్లు తెలిపారు.

నార్పల క్రీడామైదానంలో పచ్చని చెట్లు కూల్చివేత



భారీ వృక్షాలను కూలుస్తున్న జెసిబి

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలల పాఠశాల క్రీడా మైదానంలో ఉన్న భారీ వృక్షాలను జెసిబి ద్వారా కూల్చివేశారు. వివరాల్లోకి వెళ్తే... మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రాథమిక పాఠశాల ఆవరణలో తాత్కాలిక కార్యాలయం నిర్వహణకు మరమ్మతులు చేస్తున్నారు. ఇందులో భాగంగా భవనానికి అనుకుని ఉన్న భారీ వృక్షాన్ని నిర్ధాక్షిణంగా జెసిబి సాయంతో పెకలించివేశారు. అయితే అక్కడే ఉన్న విద్యార్థులు, క్రీడాకారులు కార్యాలయ నిర్వహణకు చెట్లు ఎందుకు అడ్డం వస్తాయని ప్రశ్నించినా పట్టించుకోకుండా కూల్చివేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పరిరక్షించాలని చెబుతున్న అధికారులే ఇలా పెద్ద పెద్ద వృక్షాలను తొలగిస్తే ఎలా..? అని ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా ఏళ్ల తరబడి ఉన్న భారీ వృక్షాలను క్షణాల్లో కనుమరుగు చేయడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పేదల ఆరోగ్య భద్రతకు భరోసా

అనంతపురం సిటీ : రాష్ట్రంలోని పేదల ఆరోగ్య భద్రతకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం భద్రత ఇస్తోందని సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్, కార్యదర్శి హిదయతుల్లా తెలిపారు. గురువారం అనంత రూరల్ మండలం రుద్రంపేట సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 723 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చంద్రకుమార్, ఎంపీటీసీ మహబూబ్ బి సాదిక్, వార్డు సభ్యులు శిరోమణి, సుధాకర్, మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున, ఎంపిడిఒ వై.పుల్లయ్య, వీఆర్‌ఓ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వరుణయాగం

శింగనమల : సమృద్ధిగా వర్షాలు కురిసి నియోజకవర్గ ప్రజలు సస్యశ్యామలంగా ఉండాలని కోరుతూ వరుణయాగం చేసినట్లు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఆత్మారామస్వామి ఆలయంలో ఎమ్మెల్యేతోపాటు భర్త, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో వరుణయాగం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాయకులు రాజారెడ్డి, ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, ఏపీ నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, బొమ్మన భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పరందామరెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, చాగంటి గురుమూర్తిరెడ్డి, పేట శివారెడ్డి, వెంకటనారాయణ, మల్లికార్జున్‌రెడ్డి, చెవిరెడ్డి, శివపురం వెంకటరమణ, శివశంకర్‌రెడ్డి, సోదనపల్లి చలపతి, వీరనారాయణ, సర్పంచి నాగమణమ్మ, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

అనంతపురం సిటీ : అనంతపురం రూరల్ తహశీల్దార్ విజయలక్ష్మిని గురువారం స్థానిక కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మైనార్టీ అధ్యక్షులు హనిగి శర్మాస్‌వలి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎండి ఇమామ్, జిల్లా ఉపాధ్యక్షులు గాజుల వాసు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రూరల్ మండలం పరిధిలోని ప్రజలకు మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందించాలని కోరారు.

నాగకిషోర్‌కు డాక్టరేట్



అనంతపురం : అనంతపురం జెఎన్‌టియులోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో చేసిన పరిశోధనకు నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఎస్.నాగకిషోర్ డాక్టరేట్ అందుకున్నాడు. ప్రొఫెసర్లు ఎంఎల్ఎస్.దేవకుమార్, టి.వెంకటేశ్వర్‌రావు పర్యవేక్షణలో నాగకిషోర్ డాక్టరేట్ పట్టా తీసుకున్నారు. ఈయన తన పరిశోధనలో దేశంలోని ప్రస్తుత పరిస్థితుల్లో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు సిఎఫ్‌బిసి టెక్నాలజీ ఆవశ్యకతను వివరిస్తూ 210 మెగావాట్ల సిఎఫ్‌బిసి బాయిలర్ డిజైన్ మోడల్‌ను అభివృద్ధి చేశాడు. పరిశోధనకు సహకరించిన ప్రొఫెసర్లు, కావలిలోని డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ టి.వెంకటేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'జీవనరేఖ'తో రైతుల్లో ఆత్మస్థైర్యం : ఎడిఎ రవి

అనంతపురం : నిరాశ, నిస్పృహలో ఉన్న రైతులకు మనోధైర్యం కలిగించి ఆత్మహత్యలను నివారించేందుకే జీవన రేఖ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అనంతపురం వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.రవి తెలిపారు. గురువారం అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ అధ్యక్షతన రూరల్ మండలం పరిధిలోని చియ్యేడులో జీవనరేఖ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆగ్రహావేశాలకు లోను కాకూడదన్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయం కుటుంబాన్ని రోడ్డున పడేస్తుందన్నారు. కావున రైతులు ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బానూజా, ఉద్యానశాఖ గ్రామ అధికారి, రైతులు పాల్గొన్నారు.

దుకాణాలపై అధికారుల దాడులు

అనంతపురం : అనంతపురము విజిలెన్స్, ఎంఫోర్సుమెంట్ ఆఫీసర్ ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని పలు దుకాణాలపై అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని టీవీ టవర్ దగ్గర ఉన్న మణికంఠ టూటీ ఫ్రూటీ ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహించి రిటైల్స్ ప్యాకెట్లపై తయారీదారు పేరు, ఎంఆర్‌పి ధర, తయారీ తేదీ వంటికి ముద్రించలేకపోవడంతో కేసు నమోదు చేశారు. అలాగే తయారు చేసిన టూటీ ఫ్రూటీ, పండ్ల జామ్ తక్కువ నాణ్యతగా ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్, ఎంఫోర్సుమెంట్ సిఐ ఎం.రామారావు, ఎఇఇ టి.రాజశేఖర్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం పంపిణీ

అనంతపురం : నగరంలోని కోర్టు రోడ్డులోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టిబి వ్యాధిగ్రస్థులకు గురువారం పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. దాదాపు 1726 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారిణి డాక్టర్ అనుపమ జేమ్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ మేనేజర్ ఎ.వి.చారి, మేనేజర్ చంద్రమోహన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు డి.చంద్రమోహన్, పి.ఓబిరెడ్డి, ఎస్.శ్రావణి డిపిసి, టిబి ఆఫీస్ సిబ్బంది ఎస్.శ్రీనివాసులు, రేవతి, జయవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుమంత్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కంటివైద్యులతో డిఎంహెచ్ఒ సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇ.బి.దేవి కార్యాలయంలో జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం కింద కంటి శస్త్రచికిత్సలు చేస్తున్న ఆసుపత్రుల వైద్యులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఒ మాట్లాడుతూ జిల్లాలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో కంటి పరీక్షలు నిర్వహించి 3121 మందికి చికిత్స అవసరమైనట్లు గుర్తించారన్నారు. వీరందరికీ ఆరోగ్యశ్రీ పథకం కింద డిసెంబర్ నెలాఖరిలోగా ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు సుజాత, అనుపమ జేమ్స్, నారాయణస్వామి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డిఎఒ ఓబులు, ఉమాపతి, కంటి వైద్యులు, ఆసుపత్రుల నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో 67వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన వంట మాస్టర్లు మల్లిక, అఖిల్ పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో వెళ్తూ రోడ్డు క్రాస్ చేస్తుండగా స్పందన ఫంక్షన్ హాల్ ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ మల్లిక, అఖిల్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.